## క్లుప్తంగా

### స్వామివారి సన్నిధిలో ఎండోమెంట్స్ డీసీ



అంతర్వేది ఆలయంలో ఎండోమెంట్స్ డీసీ రమేష్ బాబు

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఎండోమెంట్స్ డీసీ (కాకినాడ) డీఎల్వీ రమేష్‌బాబు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు ఆలయం వద్ద అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**సఖినేటిపల్లి:** మండలంలోని గుడిమూల, రామేశ్వరం, గొంది, అంతర్వేదిపాలెం శివారు అడ్డాలపాలెంలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుడిమూలలో కొత్త సబ్‌స్టేషన్ 33 కేవీ న్యూ లైన్ వర్క్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ వెల్లడించింది.

### తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం

**పి.గన్నవరం:** మానేపల్లి రక్షిత మంచినీటి పథకం పరిధిలోని పలు గ్రామాలకు శనివారం తాగునీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జె.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. మంచినీటి చెరువులో సహజసిద్ధంగా పెరిగిన చేపలు పట్టుకునేందుకు ఇటీవల వేలం నిర్వహించారు. శనివారం చేపలు పడుతున్న కారణంగా తాగునీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఆయన వివరించారు. ఆదివారం సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని మానేపల్లి, నాగుల్లంక, మొగలికుదురు, పెదపట్నం, వాడ్రేవుపల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

### అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబాలకు సాయం అందిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

**అంబాజీపేట:** ఇటీవల వాకలగరువులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాయకులు సాయం అందజేశారు. పార్టీ నాయకులు సమకూర్చిన నిత్యవసరాలు, దుస్తులను పంపిణీ చేశారు. సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పక్కా ఇళ్లను ఉచితంగా నిర్మించాలని జెడ్పీటీసీ, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మద్దింశెట్టి మల్లిబాబు, కాండ్రేగుల నాగబాబు, గోసంగి కుమారస్వామి, మట్టపర్తి హరి, వాకపల్లి శ్రీనివాసరావు, కడలి సుబ్రహ్మణ్యం, కేతా రాజు, చిప్పిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా బూరుగులమ్మ తీర్థం

**అంబాజీపేట:** పుల్లేటికుర్రు గ్రామంలో వేంచేసిన గ్రామ దేవత బూరుగులమ్మ తల్లి తీర్థాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు, నైవేద్యాలు చెల్లించారు. అంతకుముందు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గురువారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలు, కోయ డ్యాన్స్‌లు, తీన్‌మార్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

### విద్యార్థులకు ప్రోత్సాహక నగదు



మలికిపురంలో విద్యార్థులకు చెక్కు అందిస్తున్న ఎంఈవో విజయశ్రీ

**మలికిపురం:** మండలంలోని ఐదుగురు విద్యార్థులకు ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరుతో ఎంపిక చేసి నగదు ప్రోత్సాహం అందించింది. వీరిలో ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున చెక్కులను విద్యార్థులకు అందించారు. ఇరుసుమండ పాఠశాలలలో ముగ్గురు, మలికిపురం లోని పాఠశాలలో ఇద్దరికి ఈ మేరకు ప్రోత్సాహం చెక్కులను ఎంఈఓ ఎం.విజయశ్రీ శుక్రవారం అందించారు. అదనపు ఎంఈఓ ఎంవీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు సువర్ణరాజు, పి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# అపరిశుభ్రతే వ్యాధులకు మూలం

- ఎక్కడికక్కడే చెత్తకుప్పలు
- డ్రైనేజీల్లో పూడికలు
- ఇప్పుడు మలేరియా మాసోత్సవాలు



అంబాజీపేటలో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**అంబాజీపేట:** వాతావరణం మారింది.. అడపాదడపా వర్షం కురుస్తోంది.. అక్కడికక్కడే అపరిశుభ్రతతో దోమల విజృంభణ అధికమైంది.. ముఖ్యంగా వాతావరణ మార్పులతో వచ్చే జ్వరాలతో పాటు పరిసరాల అపరిశుభ్రత కారణంగా అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ మలేరియా మాసోత్సవాల పేరుతో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తుంది. నీటి కుంటలు నిల్వ ఉండి.. అలాగే కొబ్బరి బొండాలు వంటివి రోడ్లపై పడేయడంతో దోమలు పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఈ దోమలను నియంత్రించకపోతే వైరల్ జ్వరాలు తీవ్రత మరింత పెరుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మలేరియా నిర్మూలన వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఇప్పటికే కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని పీహెచ్‌సీల్లో మలేరియా యూనిట్ శాఖ వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహించారు. అలాగే మలేరియా నిర్మూలన లక్ష్యంగా ఈ మాసోత్సవాలు గ్రామాల్లో చేపడుతున్నారు.

**ఏ ఊరు చూసినా ఇంతే..**

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో ఏ ఊరు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలానికి ముందు మురుగు కాలువల్లో సిల్టు తొలగించే పనులు చేపట్టాలి. అప్పుడే వర్షం, మురుగునీటి పారుదల సక్రమంగా జరుగుతోంది. అయితే చాలాచోట్ల డ్రైనేజీలు, మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. సిల్టు మాటే ఎత్తడం లేదు. దీనివల్ల మురుగునీరు ఎటూ కదలక దోమలు పెరిగిపోతున్నాయి. రాత్రయితే కంటిమీద కునుకు ఉండడం లేదని ప్రజలు అంటున్నారు.

**నివారణ చర్యలివే...**

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పడాలి. పరిసరాల్లో ఉన్న నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా తరచూ లార్వా సైడ్ క్రిమి సంహారక మందును పిచికారీ చేయాలి. ఇంట్లో గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్ ఏసీఎం క్రిమి సంహారక మందును పిచికారీ చేయాలి. మలేరియా సోకిన వ్యక్తి త్వరగా కోలుకునేందుకు పండ్ల రసాలు, గ్లూకోజ్ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

### నెలాఖరు వరకూ కార్యక్రమాలు



ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల సంభవించే మలేరియా వ్యాధి నియంత్రణకు జూన్ ఒకటి నుంచి ఈ నెల 30 వరకూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.అప్పారావు, సీహెచ్ఓ, పీహెచ్‌సీ, అంబాజీపేట

# శుభ్రత పాటించాలి



దోమల నిర్మూలనపై పినపళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**అంబాజీపేట:** ప్రతి ఒక్కరూ ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌వీబీపీ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్‌వీ రామారావు, సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. తొండవరంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల ఆవరణలో ఉన్న పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, డ్రైనేజీ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జె.ప్రసాద్, ఉప సర్పంచ్ మురళి, ఏఎన్ఎం జ్యోతి, రత్నకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

**డ్రైడేతో దోమల నిర్మూలన సాధ్యం**

**ఆలమూరు:** డ్రైడే ద్వారానే దోమల నిర్మూలన సాధ్యమని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. ప్లకార్డులు ప్రదర్శించి దోమల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అలాగే రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. దీనివల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

## అతిసార వ్యాధి నివారణ సర్వేపై సిబ్బందికి శిక్షణ



మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు

**సఖినేటిపల్లి:** ఈ నెల 16 నుంచి జులై నెలాఖరు వరకూ ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా చంటి పిల్లలకు అతిసార వ్యాధి నివారణకు ఇంటింటా నిర్వహించనున్న సర్వేపై వైద్యాధికారులు ఒక రోజు సఖినేటిపల్లి పీహెచ్‌సీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.జయ గాయత్రి, సి.దుర్గా కావ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఐదేళ్ల లోపు పిల్లలకు అతిసార వ్యాధి నివారణకు, అతిసార వ్యాధి సోకి శిశు మరణాలు సంభవించకుండా ఉండేందుకు ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన సిబ్బంది కల్పిస్తారని వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రతి పిల్లవాడికి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ ట్యాబ్లెట్స్ పంపిణీ చేసి, వాటి వాడకం గురించి తల్లిదండ్రులకు సిబ్బంది తెలియజేస్తారని కూడా వారు వెల్లడించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్‌వీవీ సత్యనారాయణ, సిబ్బంది పీఎల్ఎన్ స్వామి, ఎ.సరస్వతి, బాలాశంకర్, కరుణకుమార్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళను రక్షించిన సీఐ విద్యాసాగర్



ఆలమూరు గౌతమీ కొత్త వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళతో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

**ఆలమూరు:** ఆలమూరులోని గౌతమీ కొత్త వంతెనపై ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న ఒక మహిళను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ రక్షించారు. స్థానికుల కథనం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం సమయంలో కొత్త వంతెనపై నుంచి ఆత్మహత్య చేసేందుకు ప్రయత్నిస్తున్న సంగతిని అటువైపుగా వెళుతున్న సీఐ విద్యాసాగర్ గుర్తించారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్య ప్రయత్నాన్ని విరమింపజేశారు. బిక్కవోలు గ్రామానికి చెందిన మహిళగా ఆమెను గుర్తించారు. అనంతరం ఆ మహిళను రావులపాలెంలోని సీఐ కార్యాలయానికి తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి ఆత్మహత్య చేసుకోవడం సరైంది కాదని హితవు పలికారు, అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

## తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



నగరంలో తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

**మామిడికుదురు:** నగరం గ్రామంలోని మొల్లేటివారి మెరకలో రెండు వార్డులకు చెందిన ప్రజలు శుక్రవారం తాగునీటి సమస్యపై నిరసన తెలిపారు. ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ నిరసనలో పాల్గొన్నారు. 25 రోజుల నుంచి తాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న నిర్ణీత సమయంలో అందించడం లేదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న వారితో గ్రామ సర్పంచ్ జాలెం రమణకుమారి, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్ చర్చించారు. సాంకేతిక పరంగా ఉన్న సమస్యల వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నిరసనలో కోళ్ల సురేష్‌బాబు, మొల్లేటి శ్రీనివాస్, బత్తుల సత్యవతి, కొల్లాబత్తుల శారద, బళ్ల సత్యనారాయణమ్మ, దోనిపాటి శేషాలక్ష్మి, మొల్లేటి బాల, భాను, సానబోయిన శ్రీలక్ష్మి, అమీర్ ఉన్నీషా, సువర్ణకుమారి, మొల్లేటి భాగ్యలక్ష్మి, గెద్దాడ హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సాధికారత సాధించాలి

**కొత్తపేట:** మహిళలు రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కుల ద్వారా అన్నింటా సాధికారత సాధించాలని లిటిల్ ఫ్లవర్ సొసైటీ డైరెక్టర్ వి.శేషారత్నం పిలుపునిచ్చారు. లిటిల్ ఫ్లవర్ సొసైటీ, బోస్ కే సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పరిపాలనా అభివృద్ధిలో మహిళా సాధికారత సమర్థవంతమైన నాయకత్వం (మేము అందరం కలసి నడుస్తాం) అనే అంశంపై శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో మండలంలోని పలివెల, ఖండ్రిగ, కొత్తపేట గ్రామాల ఎస్‌హెచ్‌జీ గ్రూపు లీడర్స్, యానిమేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. శేషారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానంగా మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్, లింగ వివక్షత, ప్లాస్టిక్ నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.అంబేడ్కర్, ఆయా సంస్థల సభ్యులు నరసింహారావు, కె.రామాబాయ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేత



ట్రై సైకిల్ అందిస్తున్న అసెట్ మేనేజర్ ప్రసాద్, దాత గుబ్బల రాంబాబు

**మలికిపురం:** మండలంలోని అడవిపాలెం ఓఎన్జీసీ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామానికి చెందినికి దివ్యాంగునికి మూడు చక్రాల రిక్షా పంపిణీ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క) ఆధ్వర్యంలో అడవిపాలెం గ్రామానికి చెందిన అడబాల వీర వెంకట సత్యనారాయణ అనే దివ్యాంగుడికి రాజమహేంద్రవరం ఓఎన్జీసీ అసెట్ మేనేజరు కెఎంజే ప్రసాద్ చేతుల మీదుగా ట్రై సైకిల్ అందించారు. స్థానిక దివ్యాంగునికి ట్రై సైకిల్ అడిగిన వెంటనే రాంబాబు పెద్ద మనసుతో అంగీకరించి సాయం చేయడం అభినందనీయమన్నారు. ఆస్క చైర్మన్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ సాయం కోరి రాజమండ్రిలో స్వర్ణాంధ్ర ప్రాంగణానికి ఎవరు వచ్చినా సేవలందించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. దివ్యాంగునికి నూతన దుస్తులు, దుప్పటి బహూకరించారు. కార్యక్రమంలో బాబురావు, సత్యనారాయణ, వెంకట్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం సీజ్



ఆలమూరు పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన రేషన్ బియ్యం వాహనం

**ఆలమూరు:** మండలంలోని జొన్నాడలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సీజ్ చేసింది. ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం రావులపాలెం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు జరుగుతుందనే ముందస్తు సమాచారంతో జొన్నాడ హైవేలో తనిఖీలు చేపట్టారు. దీంతో టాటా అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 2.1 టన్నులు (42 బస్తాలు) రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి మండపేట ఎంఎస్ఓ సీహెచ్ఎస్‌జీ పద్మకు అప్పగించారు. ఆపరేషన్ బియ్యం తరలింపులో కె.రామారెడ్డి, వి.సుదర్శన్‌రావు, కె.ప్రవీణ్‌కుమార్, ఎస్.జీవన్‌కుమార్ అనే వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆ వాహనాన్ని ఆలమూరు పోలీసు స్టేషన్‌కు తరలించగా ఎంఎస్ఓ పద్మ ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యోగా ట్రయల్ రన్‌ను విజయవంతం చేయండి



ఆలమూరులో యోగాంధ్ర నిర్వహణపై సూచనలిస్తున్న ఎంపీడీఓ రాజు

**ఆలమూరు:** రాష్ట్ర వ్యాప్తంగా నెల 21న జరగబోయే యోగాంధ్ర సందర్భంగా శనివారం నిర్వహించబోయే ట్రయల్‌రన్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష జరిగింది. మండలంలోని యోగాంధ్ర అభ్యసనాలకు శిక్షణ పొందిన 242 మందితో ఆయా గ్రామాల సచివాలయ పరిధిలో అభ్యాసకులతో యోగా నిర్వహించాలన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. సూపరింటెండెంట్ ఎం.మెహెర్‌ప్రకాష్, ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీఓ జి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లిలో అభివృద్ధి పనుల పరిశీలన

**కొత్తపేట:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవనం తదితర పనుల పురోగతిని గురించి దేవదాయ శాఖ డీసీ అండ్ దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆయనకు వివరించారు. అనంతరం టూరిజం డెవలప్‌మెంట్ ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆకుల రామకృష్ణ, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, మండల టీడీపీ నాయకుడు ముదునూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 వేలూ ఇవ్వాల్సిందే

**మలికిపురం:** రాష్ట్రంలో విద్యార్థులకు, తల్లికి వందనం పేరుతో నిధులు రూ.13 వేలు మాత్రమే జమ చేయడంపై పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు అభ్యంతరం తెలిపారు. శుక్రవారం లక్కవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఒకే ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా వారికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లుల అకౌంట్లో జమ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్కూలు అభివృద్ధి నిమిత్తం రూ.2 వేలు మినహాయించడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. స్కూళ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ఉంటే ప్రభుత్వ నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి కానీ రూ.2 వేలు తగ్గించటం సరికాదని ఆయన విమర్శించారు.

## ఓడలరేవు జెట్టీని పరిశీలించిన మత్స్యశాఖ జేడీ

**అల్లవరం:** ఓడలరేవు వైనతేయ నదీ తీరంలో గతంలో నిర్మించిన జెట్టీని మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఓడలరేవు నదీ తీరంలో హార్బర్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆనందరావు ప్రతిపాదనలు చేస్తున్నారని జేడీ శ్రీనివాసరావు తెలిపారు. హార్బర్ సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేస్తున్నామన్నారు. రెండు నెలలు నుంచి అమల్లో ఉన్న వేట నిషేధం శనివారం అర్ధరాత్రి నుంచి తొలగించినట్టు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సముద్ర జలాల్లోకి మత్స్యకారులు వెళ్లి యథావిధిగా చేపల వేట సాగించుకోవచ్చన్నారు.

### నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు బంద్



సూర్యారావుపేట వంతెనపై నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన రాడ్లు

సాక్షి ఇంపాక్ట్

**ఆలమూరు:** మండలంలోని సూర్యారావుపేట వంతెనపై నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. ఈనెల ఎనిమిదిన 'సాక్షి' దినపత్రికలో 'శిథిలావస్థలో సూర్యారావుపేట వంతెన' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి పాఠకులకు విదితమే. దీనిపై ఆర్‌అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారులు సత్వరమే స్పందించారు. భారీ వాహనాలు ఈ రహదారిపై వెళితే వంతెన మనుగడకే ప్రమాదమని గుర్తించి ఆ మేరకు నాలుగు చక్రాల వాహనాలు నిరోధించేందుకు వీలుగా వంతెన మధ్యలో రాడ్లను పాతారు. దీంతో బస్సులు, లారీలు, కార్లు వంటి వాహనాలు కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి నుంచి తిరిగి రావాల్సి ఉంటుంది. దీనివల్ల గ్రామస్తులు భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### సుప్రీం తీర్పు కూటమికి చెంపపెట్టు

**మలికిపురం:** వైఎస్సార్ సీపీకి న్యాయస్థానాల మీద ఎప్పుడు అపారమైన గౌరవం ఉందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్ విషయంలో కోర్టు తీర్పు హర్షించదగిన విషయమన్నారు.

### విమాన ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి

**అయినవిల్లి:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం చాలా దురదృష్టకరమని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అహ్మదాబాద్‌లోని మేఘాని నగర్‌లోని మెడికల్ కాలేజీ మెస్‌పై విమానం కూలడంతో విమానంలోని ప్రయాణికులతో పాటు మెస్‌లోని దాదాపు 20 మంది మెడికోలు మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రమాదంలో మృత్యువాత పడిన వారి కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### జూలై 31 వరకు ఓపెన్ స్కూల్లో ప్రవేశాలు

**మామిడికుదురు:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. జూలై 31వ తేదీ వరకు ఈ ప్రవేశాలు జరుగుతాయని మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బి.చిరంజీవిరావు శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కొరకు అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ భూపతి మనోహర్‌రాజు మొబైల్ నంబర్ 9494000669ను సంప్రదించాలన్నారు.

### పంట కాలువకు సాగునీరు విడుదల

**ఆలమూరు:** మండలంలోని చొప్పెల్ల పంట కాలువకు శుక్రవారం సాగునీరు విడుదలైంది. స్థానిక లాకుల వద్ద ఆలమూరు డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి లాకుల గేట్లను తెరచి నీటిని విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా చొప్పెల్ల, నర్శిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు గ్రామాల్లో సాగు చేస్తున్న సుమారు 3,400 ఎకరాలు సాగు అవుతుంది. డీసీ వైస్ చైర్మన్ గనిరాజు, చొప్పెల్ల నీటి సంఘం ఉపాధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ, నీటిపారుదల శాఖ ఏఈ టి.కృష్ణ త్రిమూర్తులు, లాకు సూపరింటెండెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.